ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం

గత పదిరోజులుగా ఎడతెరిపి కురిసిన వర్షం నుంచి శుక్రవారం కాస్త ఉపశమనం లభించింది. కుత్బుల్లాపూర్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి సహాయ చర్యల్లో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో చెత్తాచెదారాలతో పేరుకుపోయిన డ్రైనేజీ మ్యాన్‌హోల్లను గల్ఫర్ సహాయంతో శుభ్రం చేసి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా అలుగు పారుతున్న పలు చెరువులను రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సందర్శించి స్థానికంగా నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. – కుత్బుల్లాపూర్


ఫాక్స్‌సాగర్ వద్ద నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న మల్కాజిగిరి ఆర్డీఓ ఓం ప్రకాష్


వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కొంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్


దేవేందర్ నగర్‌లో డ్రైనేజీని క్లియర్ చేస్తున్న జలమండలి సిబ్బంది


గాజులరామారం చింతలచెరువు వద్ద యువకుల సందడి


బంధం చెరువు అలుగు పారుతుండటంతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న స్థానికులు


గాజులరామారం ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌లో పర్యటిస్తున్న బీజేపీ నేత మల్లారెడ్డి

క్లుప్తంగా

మణిపూర్‌లో హింసను ఆపడంలో కేంద్రం విఫలం


ప్రగతినగర్ ఆటోస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నిజాంపేట్: ఓ పక్క మణిపూర్‌లో హింసను ఆపడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. శుక్రవారం ప్రగతినగర్‌లోని జేఎస్‌టీయూ ఆటో స్టాండ్ వద్ద మణిపూర్‌లో కొనసాగుతున్న హింసపై ప్రజా సంఘాలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా ప్రజా సంఘాల జిల్లా నాయకుడు శంకర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాల పీరు మాట్లాడుతూ.. మణిపూర్‌లో చర్చిల ధ్వంసంతో పాటు మహిళలపై అకృత్యాలు జరుగుతున్నా శాంతి భద్రతలను కాపాడటంతో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయడం లేదన్నారు. సీఎం వీరేంద్ర సింగ్‌ను బలిపశువును చేసి ప్రధాని చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ప్రధాని వెంటనే హింసను అదుపు చేయాలని లేకుంటే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆటోస్టాండ్ అధ్యక్ష, కార్యదర్శులు బాబునాయక్, వెంకటేశ్వర రావు, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేట్‌బషీరాబాద్ ఏఈగా జ్ఞానేశ్వర్

కుత్బుల్లాపూర్. పేట్‌బషీరాబాద్ విద్యుత్ సెక్షన్ ఏర్పాటు చేస్తూ అధికారులను నిర్ణయం తీసుకున్నారు. సంగారెడ్డి విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్న జ్ఞానేశ్వర్‌ను ఏఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న కొంపల్లి సెక్షన్ రెండుగా విభజించారు. పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్‌ను నూతనంగా ఏర్పాటు చేసి ఏఈ నియమించారు.

మేడ్చల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీగా వేణుగోపాల్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: మేడ్చల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీగా వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం అల్వాల్ ట్రాఫిక్ పీఎస్‌లో బాధ్యతలు చేపట్టారు. కొత్తగా ఏర్పడ్డ మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీకి ఇప్పటికే డీసీపీగా డీవి శ్రీనివాసరావు ఉండగా అదనంగా వేణుగోపాల్‌రెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి వెంకటరెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు స్వాగతం పలికి మొక్క అందజేశారు.

మాన్‌సూన్ సిబ్బంది అందుబాటులో ఉండాలి

నిజాంపేట్: ఆకాల వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మాన్‌సూన్ సిబ్బంది అందుబాటులో ఉండాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె ప్రగతినగర్‌లోని అంబీర్‌చెరువు, తుర్క చెరువుల ఔట్ ఫ్లోను పరిశీలించారు. అనంతరం రాజధాని స్కూల్ నుంచి సాయినగర్ కమాన్ ఆర్కే లేఅవుట్ వరకు కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణ రావు, ఎస్ఈ సత్యనారాయణ, కార్పొరేటర్ జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని సోమయ్యనగర్‌లో శుక్రవారం గాజులరామారం యూపీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 76 మంది పాల్గొన్న ఈ శిబిరంలో జనరల్ చెకప్ చేస్తూ అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేసారు.

నిజాంపేట్‌లో బీజేపీ ర్యాలీ నేడు

నిజాంపేట్: రేడియల్ విస్తరణ, చెరువుల సుందరీకరణ, రోడ్లు తదితర హామీలను సాధించుకోవడానికి శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 6 గంటలకు నిజాంపేట్ హనుమాన్ ఆలయం నుంచి భవ్యాస్ ఆనంద్ అపార్ట్‌మెంట్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.

ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌కు చెందిన వంపుగూడెం శాంతమ్మ ఇల్లు గురువారం రాత్రి కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం బాధితురాలని పరామర్శించి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

◆ గాజులరామారం డివిజన్ పరిధి ఎన్‌టీఆర్‌నగర్-బీ కాలనీలో కూలిన పురాతన కమ్యూనిటీహాల్ భవనాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కమ్యూనిటీ భవన పునః నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా బాలాజీ లేఅవుట్‌లో పర్యటించి స్థానికంగా జరుగుతున్న డ్రైనేజీ, నాలా అభివృద్ధి పనులను పరిశీలించారు. డీఈఈ రూప, జలమండలి డీజీఎం అప్పల నాయుడు, ఏఈ కళ్యాణ్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్ తదితరులు ఉన్నారు.





ముంపు కారకులు ఎవరు..?

- పోలీసుల అదుపులో ప్లాట్లు అమ్మిన వారిలో ఓ వ్యక్తి
- 21 నిర్మాణాలను తొలగించాలని ట్రిబ్యునల్ ఆదేశాలు
- అయినా పట్టించుకోని సంబంధిత అధికారులు
- నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


నీట మునిగిన ఓక్షిత ఎన్‌క్లేవ్ కాలనీ (ఫైల్‌ఫొటో)

కుత్బుల్లాపూర్: గాజులరామారం సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతున్న జనానికి పోలీసులు భరోసా కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఓక్షిత్ ఎన్‌క్లేవ్ కాలనీలో నిత్యం వరద నీరు రావడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర గురువారం రాత్రి అక్కడ పర్యటించిన సందర్భంలో పలువురు తమను మోసం చేసి ప్లాట్లు విక్రయించి కోట్ల రూపాయలు దండుకున్నారని తెలిపారు.

నిర్మాణాల తొలగింపుపై స్పందించని అధికారులు

◆ ప్రస్తుతం వారు సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరుగుతున్నారని ఫిర్యాదు చేశారు. ఇక్కడ వెంచర్ చేసిన ప్లాట్లు అమ్మి సొమ్ము చేసుకున్న ప్రధాన వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. గతంలో ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చి 21 నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అన్ని తెలిసే అనుమతులు..

అన్ని తెలిసి ఇక్కడ నిర్మాణాలకు నీటిపారుదల ఎన్‌ఓసీ ఇవ్వడం.. జీహెచ్‌ఎంసీ పర్మిషన్లు మంజూరు చేయడం.. రెవెన్యూ అధికారులు ప్లానింగ్ స్కెచ్ ఇచ్చింది. ఈ మూడు శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటే చెరువుల పక్కన వెంచర్లు రావని పలువురు పేర్కొంటున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి వెంచర్లకు అనుమతులు ఇవ్వాలంటేనే అధికారులు భయపడతారని అన్నారు.

విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు..

ఇప్పటికే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో చెరువులు, కుంటలు, బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌ను ఆనుకొని విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఇక్కడ అక్రమ నిర్మాణాలకు పైన పేర్కొన్న మూడు శాఖల అధికారులే బాధ్యులు కావడం గమనార్హం. పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఎక్కడపడితే అక్కడ అనుమతులు ఇవ్వడం ఇక్కడ పరిపాటిగా మారింది. దీంతో వర్షం పడ్డ ప్రతిసారి ప్రజలు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు.

గజం రూ.70వేలకు అమ్ముకొని..

ఎక్కడైనా చెరువు దిగువ ప్రాంతంలో సహజంగా పారే అలుగు విడిచిపెట్టి నిర్మాణాలు చేపడతారు. కానీ ఓక్షిత్ కాలనీలో మాత్రం అవన్నీ పట్టించుకోకుండా డబ్బులు దండుకోవడమే పనిగా పెట్టుకుని ×రియల్×వ్యాపారం చేసి కోట్లు గడించారు. ఇక్కడ గజానికి రూ.70వేల చొప్పున అమ్మి సొమ్ము చేసుకున్న సూత్రధారులు గత వారం రోజులుగా కనిపించకుండా పోయారు. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పర్యటించిన సందర్భంలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చింది. గురువారం అర్ధ రాత్రి ఓ ప్రధాన సూత్రధారిని అరెస్టు చేసి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికైన తమకు న్యాయం జరుగుతుందని కాలనీవాసులు ఎదురుచూస్తున్నారు.


సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రకు ఫిర్యాదు చేస్తున్న ఓక్షిత ఎన్‌క్లేవ్ వాసులు

జీహెచ్‌ఎంసీ కార్యాలయ ముట్టడికి తరలిన కాంగ్రెస్


జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడికి వెళ్తున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి శుక్రవారం కుత్బుల్లాపూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు కార్యక్రమానికి భారీ ఎత్తున కుత్బుల్లాపూర్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓ వైపు భారీ వర్షాలు కురుస్తుండగా ఇళ్లల్లోకి నీరుచేరి ప్రజలు అతలాకుతలం అవుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రి కేటీఆర్‌లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వర్షాల వలన వలస కార్మికులు, కూలీలు, ఉపాధి లేక అల్లాడిపోతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని వారు ఆరోపించారు. ఎన్నికల సమయంలోనే మాత్రమే దళితబంధు, డబుల్‌బెడ్రూం, వరద సహాయం, ఉద్యోగాల నోటిఫికేషన్‌లు గుర్తుకు వస్తాయని విమర్శించారు. కల్లబొల్లి, మోసపూరిత మాటలతో గద్దెనెక్కిన కేసీఆర్ ప్రభుత్వానికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల చేతిలో చావుదెబ్బ తప్పదని నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాజనోళ్ల లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సమీర్‌ఖాన్, సాధూయాదవ్, సంఘం వీరేష్‌గుప్తా, బండి శ్రీనివాస్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలం

కుత్బుల్లాపూర్: రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన కొంపల్లి మున్సిపల్ పరిధిలోని ఉమామహేశ్వర కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. గతంలో వరదలతో నష్టపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.10వేల ఆర్థిక సహాయం ఇవ్వలేదని, నష్టపరిహారంపై ప్రశ్నించిన వారిన బీఆర్‌ఎస్ నాయకులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దూలపల్లిలో కల్వర్ట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వరదలతో నష్టపోయిన ఇళ్లవాసులకు రూ.50వేల ఆర్థిక సహాయం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు ఆదిరెడ్డి రాజిరెడ్డి, జీవన్ రెడ్డి, శివాజీ రాజా, సతీష్ సాగర్, రాజశేఖర్, సరితా రావు, పురుషోత్తం తదితరులు ఉన్నారు.


ఉమామహేశ్వర కాలనీలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

ఆగస్టు 6న ప్రొ. జయశంకర్ విగ్రహావిష్కరణ

జగద్గిరిగుట్ట: ప్రొ. జయశంకర్ జయంతి (ఆగస్టు 6న) సందర్భంగా డివిజన్ పరిధిలోని అవుట్ పోస్ట్ సమీపంలో విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు విశ్వ బ్రాహ్మణ సంఘం తెలియజేసింది. ఉదయం 10 గంటలకు ఈ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ జగన్ పాల్గొంటారని తెలిపింది.

రహస్యంగా వీడియో తీస్తున్న వ్యక్తికి దేహశుద్ధి

కుత్బుల్లాపూర్: యువతి బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుండగా రహస్యంగా సెల్‌ఫోన్‌తో వీడియో తీస్తున్న వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంకుకాలనీ, ఎంఎన్‌రెడ్డి నగర్ ప్రాంతంలో ఉంటున్న ఓ యువతి శుక్రవారం ఉదయం స్నానం చేస్తుండగా ఓ వ్యక్తి కిటికీలో నుంచి వీడియో తీస్తున్నట్టు గుర్తించింది. వెంటనే అప్రమత్తమై కుటుంబ సభ్యులకు తెలపడంతో సదరు వ్యక్తిని పట్టుకున్నారు. పక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలో పనిచేస్తున్న వ్యక్తిగా గుర్తించి స్థానికులు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భయపడకండి అండగా ఉంటాం..

- ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు, వివిధ డివిజన్ల ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును కలిసి ఇటీవల కురుస్తున్న వర్షాలపై చర్చించారు. గత తొమ్మిది సంవత్సరాలుగా అనేక పర్యాయాలు వర్షాలు పడ్డాయని, అప్పుడు కూడా ప్రజలను ఆదుకున్న వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అని, ప్రతిపక్షాలు ఒకవైపు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే దాన్ని కూడా రాజకీయం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తప్పకుండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పలువురు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వివరించి పరిష్కరించాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీని కలిసిన కట్టమైసమ్మ ఆలయ కమిటీ..

సూరారం కట్ట మైసమ్మ ఆలయ నూతన కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, మహమ్మద్ రఫీతో పాటు ఎమ్మెల్సీ రాజును సన్మానించారు. కొత్త కమిటీ సభ్యులు వీరారెడ్డి, యాదిరెడ్డి, రాఘవరెడ్డి, గణేష్, మల్లేష్, లక్ష్మారెడ్డి, సాయి గౌడ్, మహేష్, ప్రసాద్, అంజయ్య, వెంకటేష్, భాస్కర్, విశ్వకర్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సూరారం కట్టమైసమ్మ వద్ద ఉన్న అమ్మవారిని ఎమ్మెల్సీ రాజు, సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.




ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన పలు ప్రాంతాల ప్రజలు, కట్టమైసమ్మకు పూజలు

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి

- సీపీఎస్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ
- ఈనెల 31న అభి నహీ తో కబీ నహీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

కుత్బుల్లాపూర్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో తలపెట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథ యాత్ర శుక్రవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి చేరుకోగా సీపీఎస్ ఉద్యోగులు భారీగా తరలివచ్చి స్వాగతం పలికారు. అనంతరం శుక్రవారం రాత్రి కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎస్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల సంఖ్య నేడు రెండు లక్షలకు చేరిందన్నారు. వారందరూ ముక్తకంఠంతో సీపీఎస్ రద్దు కోరుతున్నారని పేర్కొన్నారు. గతంలో టీఎస్‌సీపీఎస్ఈ ఆధ్వర్యంలో చేపట్టిన శంఖారావం, జన జాతర, అయుత ధర్మదీక్ష వంటి కార్యక్రమాల ఫలితంగా సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ సౌకర్యం, ఫ్యామిలీ పెన్షన్ సౌకర్యాలని సాధించామన్నారు.

◆ అందులో భాగంగా నేడు 'అభి నహి తో కబీ నహి'నినాదంతో పాత పెన్షన్ సాధన సంకల్ప రథ యాత్ర ఈనెల 31న గద్వాల జోగులాంబ అమ్మవారి సన్నిధిలో ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి 33 జిల్లాల గుండా కొనసాగి యాదాద్రిలో ముగుస్తుందన్నారు. గతంలో గ్రాట్యూటీ, ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేసిన కేసీఆర్ ప్రభుత్వమే, నేడు ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత పింఛన్ విధానాన్ని మన రాష్ట్రంలో సైతం అమలు చేయాలన్నారు.

◆ అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి పీఎఫ్ ఆర్డీఏకి చేరిన 9 లక్షల కోట్ల రూపాయలను వెంటనే ఉద్యోగులకు, రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అక్టోబర్ 1న రామ్ లీలా మైదానంలో 25 లక్షల మంది ఉద్యోగులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలియజేశారు.

◆ ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు కోట మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి రవూఫ్, రాష్ట్ర సహ అధ్యక్షుడు శ్రావణ్, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్గనైసింగ్ సెక్రటరీ పవన్, దర్శన్‌గౌడ్, మల్లికార్జున్, సింహాచలం, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, టీఎస్‌యుటీఎఫ్ అధ్యక్షుడు జయసింహారెడ్డి, ఎస్‌టీయూ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, టీయూటీఎఫ్ అధ్యక్షుడు రామినేని వెంకటేశ్వరులు, టీడబ్ల్యూటీఎఫ్ అధ్యక్షురాలు రేణుక సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.


హాజరైన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు